క్లుప్తంగా

కౌలు రైతులకు సీసీఆర్‌సీ తప్పనిసరి



విలేకర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ వాకాడ అమ్మాజీ

రంగంపేట: కౌలు రైతులందరికీ పంట సాగు హక్కు కార్డు(సీసీఆర్‌సీ) తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ వాకాడ అమ్మాజీ అన్నారు. రంగంపేటలో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కౌలు రైతులందరికీ కార్డులు అందించడానికి ఇప్పటికే ఏర్పాట్లు చేశామని మండలంలో 3671 సీసీఆర్‌సీ కార్డులు అందించడానికి టార్గెట్ పెట్టుకున్నామన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం, ఎరువులు, పంట బీమా, సబ్సిడీ వంటి వాటికి ఈ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సీసీఆర్‌సీ కార్డు కావలసిన రైతులు పొలం పాస్‌బుక్, రైతు ఆధార్, ఫోన్ నంబర్, కౌలు రైతు ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లతో సంబంధిత కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.

భానుడు భగభగ



ఎండలకు నిర్మానుష్యంగా మారిన ఎయిర్‌పోర్టు రోడ్డు

మధురపూడి: రోహిణీ కార్తెలో భానుడు సెగలు పుట్టించాడు.. వేడి గాలులతో నిప్పులు చెరిగాడు. శనివారం కోరుకొండలో 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. నిత్యం రద్దీగా ఉండే ఎయిర్‌పోర్టు రోడ్డు మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారింది. బయటకు వచ్చేందుకు ఎవరూ సాహసించలేదు.

ఎన్టీఆర్‌కు శత వందనం



సత్యానందం కుంచె నుంచి జాలువారిన ఎన్టీఆర్ చిత్రం

అనపర్తి: విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారకరామారావు శత జయంతిని పురస్కరించుకుని మండలంలోని రామవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న డ్రాయింగ్ టీచర్ ఎం.సత్యానందం ఎన్టీఆర్ చిత్రపటాలను పెయింటింగ్ చేశారు. సత్యానందం ఆయిల్ పేస్టల్స్, పెన్ ఉపయోగించి గీసిన ఎన్టీఆర్ చిత్రాలు పలువురిని అమితంగా ఆకట్టుకున్నాయి.


ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



సీతానగరంలో వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు, లైబ్రేరియన్ అరుణ్‌కుమార్

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం శనివారం ఉత్సాహంగా సాగింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ లైబ్రేరియన్ టి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో ఉపాధ్యాయుడు జి.శేఖర్ విద్యార్థులచే సరస్వతి నమస్తుభ్యం గేయాన్ని ఆలపింపజేశారు. చదవటం మాకిష్టంలో భాగంగా పిల్లలతో కథలు చదివించారు. పుస్తక సమీక్షలు చేయించారు. శేఖర్ మాస్టర్ సైన్స్ విజ్ఞానంపై వివరించారు. వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో విద్యార్థులకు మజ్జిగ, చాక్లెట్లు పంపిణీ చేశారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మహాపుష్కర వనం ఆర్బోరేటమ్‌లో మొక్కలు నాటుతున్న సిబ్బంది

రాజానగరం: లాలాచెరువులోని గోదావరి మహా పుష్కర వనం, ఆర్బోరేటమ్‌లో ప్రాంతీయ అటవీ పరిశోధన విభాగం ఆధ్వర్యంలో లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్ శనివారం జరిగింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం ఆవశ్యతను తెలియజేస్తూ వనంలో స్టేట్ సిల్వీకల్చరిస్టు అధికారి షేక్ సలాం పర్యవేక్షణలో అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం వాకర్స్‌చే మొక్కలను నాటించారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది ఆశారేఖ, మధుమోహన్, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

మూడో పంటతో అపార సిరులు

- అపరాల సాగుకు మొగ్గు చూపని రైతులు
- భూసారం పెంచే పచ్చిరొట్టపైనా తగ్గిన ఆసక్తి



పెదపూడిలో వరి కోతలు పూర్తయిన పొలం

పెదపూడి: విచ్చలవిడి ఎరువుల వాడకం.. భూమిలో తగ్గిన పోషకాలతో పంట భూములు సారం కోల్పోతున్నాయి.. అలాంటి భూముల్లో సిరులు పండించాలంటే అపరాలు, పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. డెల్టా కాలువల ద్వారా నీరందే భూముల్లో మూడో పంటగా సుమారు 80 శాతం మేర భూముల్లో అపరాలు, భూసారానికి పిల్లి పెసర, జీలుగు వంటి పచ్చిరొట్ట పైర్లు సాగు చేసేవారు. కాలక్రమేణా సాగునీటి విడుదలలో మార్పులు, తద్వారా ఖరీఫ్, రబీ పంటల జాప్యం, పంట కోతకు యంత్రాల వినియోగంతో రైతులు అపరాల సాగుకు ఆసక్తి చూపడం లేదు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో మొత్తం ఏడు మండలాల్లో ఈ రబీలో 57,442 ఎకరాల్లో వరి సాగు చేశారు. అనపర్తిలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2 వేలు, బిక్కవోలులో 13 వేలు, కోరుకొండలో 2,465, సీతానగరంలో 1,917, రాజానగరం మండలంలో 8,060 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం ఈ రెండు నియోజకవర్గాల్లో కేవలం 15 శాతం మేర భూముల్లోనే అక్కడక్కడా మూడో పంటగా అపరాల సాగు కనిపిస్తోంది.

ఆ జాప్యం కారణంగానే..

సకాలంలో పంటలు సాగు చేస్తే అపరాలు లేదా భూసారం పెంచే పచ్చిరొట్ట సాగుకు అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు అంటున్నారు. సకాలంలో కాలువలకు నీటి విడుదల చేయడంతో మొదట పంట ఖరీఫ్‌కు సంబంధించి జూన్ మొదటి వారంలో నారుమడులు వేసుకుని, జూలై మొదటి వారం నాట్లు పూర్తి చేయాలి. నవంబర్ ఆఖరి వారంలో కోతలు పూర్తి కావాలి. రెండో పంట దాళ్వాకు సంబంధించి డిసెంబర్ మొదటి వారంలో నారుమడులు వేసి, ఆ నెలాఖరుకు నాట్లు పూర్తి చేయాలి. మార్చి నెలాఖరుకు కోతలు పూర్తయితే మూడో పంటగా మినుము, పెసర వంటి అపరాల సాగుకు అవకాశం ఉంటుంది. మినుముకు సమయం సరిపోకపోయినా పెసర లేదా భూసారం పెంచే పిల్లి పెసర, జీలుగ, వంటి పచ్చిరొట్ట సాగుకు అవకాశం ఉంటుంది. అయితే ఖరీఫ్ నారుమడులు జూలైలో, రబీ నారుమడులు జనవరి నెలాఖరుకు వేస్తున్నారు. దీంతో మూడో పంటకు అవకాశం ఉండటం లేదు.

యంత్రాల వినియోగంతో..

దాళ్వా మాసూళ్లు ఆలస్యమై అదును దాటిపోవడం అపరాల సాగు తగ్గిపోవడానికి ఒక కారణమైతే, వరి పంట కోతలకు యంత్రాల వినియోగం మరో కారణం. మినుము, పెసర లేదా పచ్చిరొట్ట సాగు చేయాలంటే భూమిలో తేమ ఉండాలి. ప్రస్తుతం అత్యధిక శాతం రైతులు వరి కోతలకు యంత్రాలు వినియోగిస్తున్నారు. యంత్రాలు పొలంలో తిరగాలంటే నేల పూర్తిగా ఆరిపోవాలి. దీంతో పొలంలో అపరాల విత్తనాలు చల్లేందుకు అవకాశం ఉండడం లేదు.

అనేక ప్రయోజనాలు



మూడో పంటగా అపరాలు, పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుంది. ఆయా పంటలతో భూమిలో నత్రజని పెరిగి భూసారం వృద్ధి చెందడంతో పాటు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అందుకు ఖరీఫ్, రబీ పంటలు సకాలంలో సాగు చేయాలి. రబీ మార్చి నెలాఖరుకు పూర్తయితే అపరాల సాగుకు వాతావరణం అనుకూలిస్తుంది. లేదా పిల్లి పెసర, జీలుగ, వంటి పచ్చిరొట్ట వేస్తే భూసారం పెరుగుతుంది. సూపర్ వేసి దమ్ములో కలియదున్నితే పచ్చిరొట్ట సేంద్రియ ఎరువుగా దోహదపడుతుంది.

–టీవీఆర్.మణిదీప్, వ్యవసాయాధికారి, పెదపూడి మండలం

ప్రతిభను వెలికితీస్తే మెరికలే..



క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తే మెరికల్లా తయారవుతారని, దీనికి టోర్నమెంట్లు దోహదపడతాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం సీతానగరం డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో లంకూరు మెగా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, అందరూ స్నేహపూర్వక వాతావరణంలో సాగాలన్నారు. 2009 నుంచి నిర్విరామంగా లంకూరు మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన నామవరం పాథర్స్ టీమ్‌కు రూ.40 వేలు, రన్నర్‌గా నిలిచిన సీతానగరం టీమ్‌కు రూ.25 వేలతో పాటు ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, మండల సర్పంచుల సమాఖ్య సంఘ అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, పీఏసీఎస్ చైర్ పర్సన్ మట్ట వసంతరావు, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, నాయకులు చల్లమళ్ల సుజీరాజు, మట్ట శ్రీను, ఈవెంట్ మేనేజర్ మట్ట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

పథకాలతో ఇంటింటా సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కాపవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



కాపవరంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు అందించి సంక్షేమ వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కాపవరంలో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అందరికీ ఇంటి స్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మించి ఇస్తూ సొంతింటి కలను నెరవేరుస్తారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు పాలన చూసిన ప్రజలు విసిగి వేసారి 23 సీట్లు ఇచ్చి ఆయన రాజకీయ జీవితానికి సమాధి కట్టి సరైన బుద్ధి చెప్పారన్నారు. అయినా చంద్రబాబుకు బుద్ధి రాలేదంటూ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ కర్రి గంగరాజు, ఎంపీటీసీ మార్మెళ్ళ బీష్ముడు, ఉప సర్పంచ్ గోపాలకృష్ణ, మాజీ ఎంపీటీసీ నిడదవోలు శ్రీను, జి.సూరిబాబు, కొట్టు లక్ష్మి, సత్యంశెట్టి రాజు, పిల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- బుచ్చెంపేటలో గడప గడపకూ..



బుచ్చెంపేటలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శనివారం కోరుకొండ మండలం బుచ్చెంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అక్కడి పాతూరు ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ బుచ్చెంపేటలో రూ.4 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.38 లక్షలతో మాత్రమే అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మహానాడులో గొప్పలు చెప్పుకునే టీడీపీ నేతలు ప్రజల సమస్యలను గాలికొదిలేశారన్నారు. మొత్తం 250 గడపలకు తిరిగి ఆయా కుటుంబాలను కలుసుకుని సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఎమ్మెల్యే తెలుసుకున్నారు. మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. దానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు చేపడతామన్నారు. మండుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సర్రాజు, జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్ తేజ, సర్పంచ్ తాడేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో గృహప్రవేశం

మధురపూడి: మునగాలలోని జగనన్న కాలనీలో లబ్ధిదారుడు శ్రీనివాస్ గృహ ప్రవేశం జరిగింది. దీనికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరై గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేస్తుందన్నారు. గృహప్రవేశం చేసి శ్రీనివాస్–నాగమణి దంపతులు రాజానగరం నియోజకవర్గంలోని పేదలందరికీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, మునగాల ఎంపీటీసీ సభ్యుడు సి.లోవరాజు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్, హెల్త్ కార్డుల పేరిట మోసం



గ్రామాల్లో సొమ్ము వసూలు చేసి ఇస్తున్న ఈ-శ్రమ్ కార్డు

రంగంపేట: రాజమహేంద్రవరం నుంచి వస్తున్న కొందరు యువకులు మండలంలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సచివాలయ సిబ్బందిమని చెబుతూ ఈ-శ్రమ్, హెల్త్ కార్డుల పేరిట మోసానికి పాల్పడుతున్నారు. కుటుంబ సభ్యులందరూ హెల్త్ కార్డులు చేయించుకోవాలంటూ చెప్పి, ఆధార్, ఫోన్ నంబర్లు అడిగి ఈ-శ్రమ్ కార్డుకి రూ.50, హెల్త్ కార్డుకి రూ.50 చొప్పున ఒక్కొక్కరి నుంచి రూ.100 గుంజుతున్నారు. అలా ఇంటిలో ఎంతమంది ఉంటే అన్ని రూ.100లు కొట్టేస్తున్నారు. సచివాలయం నుంచి వచ్చారంటే నిజమేనని నమ్మి కొందరు డబ్బులు సమర్పించుకుంటున్నారు. దీనిపై సచివాలయ అధికారులను అడిగితే తమకేమి సంబంధంలేదని వారెవరో కూడా తమకు తెలియదని చెబుతున్నారు. ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, త్వరలోనే ఈ పరిధిలోకి వచ్చే వారందరికీ ప్రభుత్వమే పోర్టల్‌లో వారి వివరాలు నమోదుచేసి ఉచితంగా కార్డులు అందచేస్తుందంటున్నారు.

వలంటీర్ల సేవలకు వందనం



వలంటీర్లకు పురస్కారాలు అందిస్తున్న సర్పంచ్ గిరడా గంగాభవాని, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

అనపర్తి: వలంటీర్లు నిస్వార్థమైన సేవలందిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని రామవరం గ్రామ సచివాలయంలో వలంటీర్లకు సేవా పురస్కారాలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు.

అనంతరం సేవా మిత్రలుగా ఎంపికైన 34 మంది వలంటీర్లను సర్పంచ్ గంగాభవాని, ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నల్లమిల్లి భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు కర్రి రామచంద్రారెడ్డి, చింతా బుల్లెమ్మాయి, సచివాలయం కార్యదర్శులు పీవీ కృష్ణారెడ్డి, రామ్మోహన్, నల్లమిల్లి వెంకటరెడ్డి, సత్తి అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం కావాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మధురపూడి: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు అన్నారు. కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సర్రాజు అధ్యక్షతన రైతులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ మొదటి వారం నుంచే విత్తుకోవాలన్నారు. ఆకుమడులు జూన్‌లోనే వేయడం వల్ల అక్టోబర్ చివరికి పంట కోతలకు వస్తుందని, దీంతో నవంబర్‌లో ఎదురయ్యే తుపానుల నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతన్నలకు ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. 30న కోరుకొండలో జిల్లా స్థాయి మీటింగ్ ఏర్పాటుచేసి, రైతు భరోసా, ఇన్‌పుట్ రాయితీ విడుదల చేయనున్నట్టు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సర్రాజు తెలిపారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వ్యవసాయ శాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, మండలాధికారి గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేద్దాం

ఆరోగ్యశ్రీ సిబ్బందిని ఆదేశించిన కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ఆరోగ్యశ్రీ సేవల అమలు తీరుపై వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా అందజేసే వైద్య విధానం ద్వారా ప్రభుత్వ ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆ ప్రక్రియలో భాగంగా ఆయా ప్రభుత్వ ఆసుపత్రులకు చెందిన వైద్యాధికారులు మెరుగైన పనితీరు చూపాలన్నారు. కొందరు పనితీరు మెరుగు పరిచేందుకు కృషి చేస్తుండడం అభినందనీయమని అన్నారు. అయినప్పటికీ ప్రైవేటు ఆసుపత్రులతో పోల్చితే ప్రభుత్వ వైద్యుల పనితీరు సంతృప్తికరంగా లేదన్నారు. ఇకపై ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఆరోగ్యశ్రీ వైద్య సేవలు 50 శాతం మేర విస్తరించాల్సి ఉందన్నారు. గర్భిణులకు వైద్య సేవలు అందించే సామర్థ్యం పెంచాలన్నారు. సాధారణ డెలివరీలు చేపట్టాలని, వాటికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకు అవసరమైన ఇండెంట్ అందజేయాలని సూచించారు. అనపర్తి ఏరియా ఆసుపత్రిలో గత నెల 22 గర్భిణి కేసులు ఉండగా, ఈ నెలలో 69 కేసులు, కొవ్వూరులో 58 నుంచి 100 వరకూ ప్రగతి చూపారన్నారు. ఇంకా పెంచాల్సి ఉందన్నారు. కడియం, మలకపల్లి, దొమ్మేరు, ఉండ్రాజవరం, అన్నదేవరపేట తదితర 13 ఆసుపత్రులలో ఒక్క డెలివరీ కేసు నమోదు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో ఆయా ఆసుపత్రులు నమోదుతో పాటు వైద్యాధికారులు కూడా వారి పేర్లు నమోదు పూర్తి చెయ్యాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం నాటికి సంపూర్ణ నివేదిక అందజేయాలని, ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో నమోదు చేసే ప్రక్రియపై కోఆర్డినేటర్ సమగ్రంగా అవగాహన కల్పిస్తారన్నారు. ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించే సామర్థ్యం మేరకు నాడు- నేడు ద్వారా మౌలిక సదుపాయాలు, మానవ వనరుల అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. సమావేశంలో జిల్లా వైద్య అధికారులు డాక్టర్ ఎస్.వసుంధర, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డాక్టర్ కె.సాయికుమార్ పాల్గొన్నారు.

హుండీలో నగదు చోరీ

సీతానగరం: రాపాక మెట్ట గంగాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద హుండీలో నగదు చోరీకి గురైందని స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. ఈ నెల 25 అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి ఆలయం వద్ద హుండీలో నగదును దొంగిలించారు. రూ.5 వేల పైబడి నగదు ఉండొచ్చని అంచనా.

నేడు అన్నసమారాధన

మధురపూడి: మునగాల శివారు తలుపులమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు చింతాకుల లోవరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దాల రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

రాష్ట్ర విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా సాదే



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలుపుతున్న చంటిబాబు

సీతానగరం: రాష్ట్ర విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే చంటిబాబు ఎంపికయ్యారు. ముగ్గళ్లకు చెందిన ఆయన గతంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా సేవలందించారు. ప్రస్తుతం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పార్టీకి సేవలు అందించిన చంటిబాబును డీవీఎంసీలో సభ్యుడిగా ఎంపిక చేయడంపై నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా ఈ ఎంపిక పత్రాలను చంటిబాబుకు శుక్రవారం స్వీకరించారు. ఈ సందర్భంగా చంటిబాబు మాట్లాడుతూ ఈ పదవికి తనను ఎంపిక చేయడంపై ఎమ్మెల్యే రాజా, జిల్లా కలెక్టర్ మాధవీలతకు కృతజ్ఞతలు తెలిపారు.

పాలవెల్లువను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.హరికృష్ణ సత్యరెడ్డి

పెదపూడి: జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కర్రి హరికృష్ణ సత్యరెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జగనన్న పాలవెల్లువ పథకం సర్వేపై ఓరియంటేషన్ కార్యక్రమం గ్రామ వలంటీర్లు, పశుసంవర్ధశాఖ, వైఎస్సార్ క్రాంతిపథం, రెవెన్యూ శాఖ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28, 29 తేదీల్లో ట్రయిల్‌రన్‌గా ప్రయోగాత్మకంగా గ్రామాల్లో సర్వే జరిపించాలని చెప్పారు. ఏమైనా సాంకేతిక సమస్యలు, ఇబ్బందులు ఎదురైతే జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ)కు నివేదిస్తే పరిష్కరిస్తారని చెప్పారు. మండలంలో మొత్తంగా 15 గ్రామాల్లో ఈ సర్వే ప్రారంభించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి చింతా కిరణ్మయి, తహసీల్దార్ టి.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు లైన్ల పునరుద్ధరణ



విద్యుత్ లైన్లను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

రంగంపేట: గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి మండలంలోని పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో పాటు కండక్టర్ వైర్లు తెగిపోయాయి. సుభద్రంపేట, దొడ్డిగుంట గ్రామాలకు చెందిన విద్యుత్ సరఫరా అయ్యే 11 కేవీ స్తంభాలు పడిపోవడం, చండ్రేడు తదితర గ్రామాల్లో చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్తు లైన్లపై పడిపోయాయి. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పల్లకడియం నుంచి గ్రామాలకు విద్యుత్తు సరఫరా పునరుద్ధరించారు. మొత్తం ఫీడరు పెట్రోలింగ్ చేసి సమస్యలను గుర్తించి మరమ్మతులు చేశామని ఏఈ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు.

కోరుకొండలో గిరి ప్రదక్షిణ

మధురపూడి: కోరుకొండలో వేంచేసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద శనివారం గిరి ప్రదక్షిణ జరిగింది. ప్రతి శనివారం భక్తులు కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. భక్తిశ్రద్ధలతో స్వామివారి నామాన్ని జపిస్తూ జరిగిన కార్యక్రమంతో ఆధ్యాత్మిక భావం వెల్లివిరిసింది.

రీ-సర్వేకు రైతులు సహకరించాలి

గోకవరం: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా భూ రీసర్వే ప్రారంభమవుతుందని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ నుంచి కామరాజుపేట పంచాయతీ పరిధి శివరామపట్నం రామాలయం ఆవరణలో మధ్యాహ్నం 3గంటలకు భూహక్కుదారులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. రైతులు తమ భూమి పాసుపుస్తకాలు, ఆధార్ కార్డు, దస్తావేజులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంక్ ఖాతా బుక్ వాటికి సంబంధించి రెండు సెట్స్ జిరాక్స్‌లు తీసుకురావాలని ఆయన తెలిపారు.